Assembles Of The Living Elohim (1. Tim 3:15) India presents........ ఎలోహీం ఒక్కమారే పలుకును రెండు మారులు పలుకును. అయితే మనుష్యులు అది కనిపెట్టరు

Satyamunakai Poratam REGD. No. 67970 / 97

# సత్యమునకై పోరాటం

Regd. Monthly Newspaper
Postal Regd. No. H/APM/01/2009-2011
Valid upto 12/2011
Posted on 30th of Every Month
Annual Subscription Rs. 50/-
To :

Editor & Publisher :
Bro. Isaac E. Kusuma
Malikipuram - 533 253
E.G. Dist. (A.P.) India.

Website : www.aotle-india.org
E-mail : satyamunakaiporatam@gmail.com
Office : Ph: 98493 85038

VOLUME : 13 NISAN 5772 (APRIL 2011) PAGES:4 ISSUE 154

హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు

# అబద్ధ బోధకుల ప్రభురాత్రి భోజన సంస్కారము

బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

**"పస్కా"** అనగానే అది పాతనిబంధన పండుగలలో ఒకటి, అది ఇశ్రాయేలీయులకే గాని మనకు కాదు అని వాక్యమెరుగని క్రైస్తవుల బోధ. నిజానికి పస్కా అంటే ఏమిటో క్రైస్తవ బోధకులకు గాని క్రైస్తవ విశ్వాసులకు గాని తెలియనే తెలియదని చెప్పవచ్చును. పాతనిబంధన పస్కాకును క్రొత్తనిబంధన పస్కాకును తేడా చెప్పలేని వారు బైబిలును బోధించుట చూస్తుంటే చాలా విచిత్రంగానే ఉంటుంది. ఇశ్రాయేలీయులు లేక యూదులు పస్కాను ఎలా ఆచరించారు? మెస్సీయ తన శిష్యులతో పస్కాను ఎలా ఆచరించాడు? అని తెలుసుకోవలసిన బాధ్యత ప్రతీ క్రైస్తవునికి ఉన్నది గదా! ప్రభురాత్రి భోజనము, సంస్కారము, ప్రభువు బల్ల, బల్లారాధన అంటే మాకు తెలుస్తుంది గాని **"పస్కా"** అంటే మాకు ఎలా అర్ధం అవుతుంది అని ఒక క్రైస్తవుడు అన్నాడు. నిజమే మరి ఆయనగారు బైబిలు చదివితే గదా! ఎవడో బోధకుడు చెప్పిన మాట విని తల ఊపడమే గాని అసలు బైబిలులో ఏమని ఉంది అని ఎప్పుడైనా పరీక్షించి చదివితే గదా **"పస్కా"** అంటే ఏమిటో తెలియడానికి?

గురువులేని విద్య గుడ్డి విద్య అన్నట్లు క్రైస్తవులు వాళ్ళ గురువును (యషువ మెస్సీయను) వదిలి పనికిమాలిన బోధకులను, వాక్యమెరుగని అంధులను వెంబడించుచున్నందున ఆయోమయస్థితిలో పడిపోయారు. మెస్సీయ అడుగుజాడలు (1పేతురు 2:21) వెంబడించుట, మెస్సీయను పోలి జీవించుట (1కొరింథీ 11:1) మెస్సీయ వాడుక (లూకా 4:16) చొప్పున నడచుట తెలియని క్రైస్తవులకు బైబిలు అర్థం అవ్వదు. మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలు బాగుగా చదివితే మన గురువు అయిన యషువ మెస్సీయ మాదిరి, అడుగుజాడలు తెలుస్తాయి. ఆయన తన నోటితో **"పస్కా"** అని చెపితే, దానిని ఈ క్రైస్తవ దొంగబోధకులు ప్రభురాత్రి భోజనమని, సంస్కారమని, ప్రభువుబల్ల అని , బల్లారాధనని, వేరే పదములతో తప్పుడు అర్థాలు చెప్పి క్రైస్తవులనందరినీ దారి తొలగించారు. అసలు ఈ క్రైస్తవ బోధకులే దయ్యాలు (డెవిల్స్). గనుకనే **"పస్కా"** అంటే ఏమిటో ఏ డినామినేషన్ క్రైస్తవుడికీ తెలియడం లేదు. **"పస్కా"** అంటే ఏమిటి? అని క్రైస్తవులు అడుగుతున్నారంటే, వాక్య విషయంలో వాళ్ళు ఎంత హీనస్థితిలో ఉన్నారో అర్థం అవుతుంది. మా ఏరియాలో పేరుమోసిన పెంతెకోస్తు పాస్టరొకడు ఉండేవాడు. అతడికి సహితం **"పస్కా"** అంటే ఏమిటో అర్థం కాలేదు. నాతో వాదిస్తూ పస్కా ఇశ్రాయేలీయులది మనది కాదు అన్నాడు. పెంతెకోస్తు (అంటే వారముల పండుగ) ఇశ్రాయేలీయుల పండుగ మరి నీవు పెంతెకోస్తు సంఘమని పేరు ఎలా పెట్టావు అని అడిగితే, అది క్రొత్తనిబంధనలో ఉన్నది అన్నాడు. చాలా సంతోషం **"పస్కా"** కూడా క్రొత్తనిబంధనలోనే ఉంది చూడు అన్నాను.

**క్రొత్త నిబంధనలో పస్కాను గూర్చిన వివరణ చూద్దామా:-**

1. **మత్తయి 26:17** శిష్యులు యషువ వద్దకు వచ్చి – పస్కాను భుజించుటకు మేము నీకొరకు ఎక్కడ సిద్ధపరచగోరుచున్నావని అడిగిరి.
2. **మార్కు 14:12** ఆయన శిష్యులు–నీవు పస్కాను భుజించుటకు మేమెక్కడికి వెళ్ళి సిద్ధపరచవలెనని కోరుచున్నావనిఆయననడుగగా
3. **లూకా 22:8** యషువ పేతురును యోహానును చూచి – మీరు వెళ్ళి మనము భుజించుటకై పస్కాను మనకొరకు సిద్ధపరచుడని వారిని పంపెను.
4. **యోహాను 12:1** కాబట్టి యషువ తాను మృతులలోనుండి లేపిన లాజరు ఉన్న బేతనియకు పస్కా పండుగకు ఆరు దినములు ముందుగా వచ్చెను.

పై వచనములు అన్నీ పస్కాను గూర్చి వ్రాసినవి. **"పస్కా"** అంటే యషువ మెస్సీయ ఆయన శిష్యులు ఏమి చేసారు? మేకపిల్లను గాని/గొఱ్ఱెపిల్లను గాని చంపి దాని రక్తము ఒలికించి దానిని అగ్నితో కాల్చి చేదు కూరలతోతిన్నారా? లేక రొట్టె–ద్రాక్షారసం త్రాగినారా? వాక్యంలో పరిశీలిద్దాం.

యావె సమాజం వారే కాదు **"పస్కా"** ఆచరించు ఎవరూ మేకలను/గొఱ్ఱెలను బలి ఇవ్వరు. యషువ మెస్సీయయే పస్కా పశువుగా (1కొరింథీ 5:7) బలియైన సంగతి వారికందరికీ బాగుగా తెలుసు. యషువ మెస్సీయ యూదులవలె (మార్కు 14:12/లూకా 22:7) పస్కా పశువును వధించలేదు. ఆయనే మన పస్కా పశువు (1కొరింథీ 5:7) లోక పాపములను తీసివేయు ఎలోహీం గొఱ్ఱెపిల్ల (యోహాను 1:29) యూదులు చేయుచున్న పస్కా పండుగకు, యషువ మెస్సీయ చేయుచున్న పస్కా పండుగకు తేడా తెలియని క్రైస్తవ జనాంగమునకు క్రొత్తనిబంధన మార్గము మాత్రము ఏమి తెలుసు?

మెస్సీయ పస్కాను యూదులు ఆచరించిన విధంగా (మార్కు 14:12/లూకా 22:7) ఆచరించలేదు. యావె నియామక కాలమును అనుసరించి క్రొత్తనిబంధన పద్ధతిలో పస్కా ఆచరించాడు

**అయితే పస్కా ఎప్పుడు:-**

1. **నిర్గమ 12:1–28** : మొదటి నెల 14వ దినము (అంటే నీసాను 14)
2. **లేవీ 23:5–8** : మొదటి నెల 14వ దినమున సాయంకాలమందు
3. **సంఖ్యా 28:16** : మొదటి నెల 14వ దినమున యావెకు పస్కాపండుగ
4. **యెహోషువ 5:10** : ఇశ్రాయేలీయులు గిల్గాలులో దిగి ఆ నెల పదునాలుగవ తేదీన సాయంకాలమున యెరికో మైదానములో పస్కాపండుగను ఆచరించిరి.
5. **యెహెజ్కేలు 45:21** : మొదటి నెల పదునాలుగవ దినమున పస్కాపండుగ ఆచరించవలెను.
6. **ఎజ్రా 6:19** : చెరలోనుండి విడుదల నొందినవారుమొదటి నెల పదునాలుగవ దినమున పస్కా పండుగను ఆచరించిరి
7. **ద్వితీ 16:1** : సంఖ్యా 9:24, 2రాజులు 23:21, 2 దిన 35:1 మొదలగునవి సంఖ్యా 9:6–14, 2దిన 30:2,3, 13–15

**క్రొత్త నిబంధనలో పస్కా:-**

1. **లూకా 2:41** : పస్కాపండుగప్పుడు ఆయన తల్లిదండ్రులు ఏటేట యరూషలేమునకు వెళ్ళుచుండువారు (నిర్గమ 13:10)
2. **లూకా 2:42** : ఆయన పండ్రెండేళ్ళవాడైయున్నప్పుడు ఆ పండుగ నాచరించుటకై వాడుకచొప్పున వారు యరూషలేమునకు వెళ్ళిరి
3. **మత్తయి 26:18,19** : యషువ తమకాజ్ఞాపించిన ప్రకారము శిష్యులు చేసి పస్కాను సిద్ధపరచిరి
4. **మార్కు 14:16** : శిష్యులు వెళ్ళి పట్టణములోనికి వచ్చి ఆయన వారితో చెప్పినట్లు కనుగొని పస్కాను సిద్ధపరచిరి.
5. **లూకా 22:13** : వారు వెళ్ళి ఆయన తమతో చెప్పినట్లు కనుగొని పస్కాను సిద్ధపరచిరి.
6. **యోహాను 12:1** : పస్కా పండుగకు ఆరు దినములు ముందుగా వచ్చెను
7. **1కొరింథీ 5:7** : మెస్సీయ అను మన పస్కా పశువు వధింపబడెను. అటులనే ఈ వాక్యములు చదవండి.

అ॥కార్య 12:4, 1కొరింథీ 11:23

పాతనిబంధన గ్రంథంలో స్పష్టముగా చెప్పిన దానినే క్రొత్తనిబంధనలో మనం చేస్తున్నాము. మెస్సీయ చేసిన మార్పులు మనం గమనిస్తే సరిపోతుంది. క్రైస్తవ బోధకులు మొత్తానికి అసలు పదాలు తీసేసి అర్థాలు మార్చేసి బోధించుట ఏమిటి?

ఇది ఒక ఆచారం, దాంతో మనకి సంబంధం లేదు అని ఒక బోధకుని విమర్శ. నిజమే, ఇది యావె ఇచ్చిన ఆచారం. నిర్గమ 12:26, 13:9 తప్పనిసరిగా చేయవలసిందే. యావె ఆచరమును కాదనే హక్కు మానవునికి లేదు.

**ఆచారములు రెండు రకాలు:-**

1. పరమతండ్రి యిచ్చిన ఆచారం: (నిర్గమ 12:26, 13:9)
2. మానవ ఆచారములను బైబిలు ఖండిసున్నది. మత్తయి 15:9, కొలస్సీ 2:20, తీతు 1:14, యెషయా 29:13, మీకా 6:16, హోషేయ 5:11

**అసలు ఆచారం అంటే ఏమిటి?**

**ఏదైనా ఒక పనిని రోటీన్‌గా చేయడమే గదా ఆచారం అంటే:** కాదని చెప్పగలరా? మనం నిద్రలేచిన దగ్గరనుండి నిద్రపోయేవరకూ చేసేపనులన్నీ ఆచారములే కదా? ఆదివారం గుడికి వెళ్ళడం, గుడ్‌ఫ్రైడే రోజున ఏడ్వడం, ఈస్టర్ ఆదివారమున ఆనందించడం, డిశెంబర్‌లో క్రిస్ట్‌మస్ చెయ్యడం, డిశెంబర్ 31 వాచ్‌నైట్ సర్వీస్ చెయ్యడం, జనవరి 1 క్రొత్తసంవత్సర ఆరాధన చెయ్యడం, పాటలు పాడటం, వాక్యం చదవడం, వినడం, ప్రార్ధనలు చెయ్యడం ఇవన్నీ ఆచారములు కావా? ఇవి మానవులు పెట్టిన ఆచారములు, కాని యావె ఆచారములు వేరు. ఆయన పెట్టిన ఆచారములకు ఒక అర్థముంది. నిర్గమ 12:26 చదవండి తెలుస్తుంది. పస్కా చరిత్రను సూచిస్తుంది. మెస్సీయను తెలియపరుస్తుంది. పస్కాను గూర్చి ఎన్నో చెప్పవచ్చును. మీరు చేసే ఆచారాలకు ఉన్న అర్థములేమిటి? అన్నీ అబద్దాలేగదా!

1. **ఆదివారం పునరుత్థానం అనే మీ మానవ ఆచారం అబద్ధం**
   **– అది నీసాను 17వ తేదీ ఆయన పునరుత్థానం**
2. **గుడ్‌ఫ్రైడే అనే మీ మానవ ఆచారం అబద్ధం**
   **– అది నీసాను 14వ తేదీ ఆయన మరణం**
3. **లెంట్ అనే మీ మానవ ఆచారం అబద్ధం**
   **– అది బైబిలు ఖండితంగా చెప్పనిది**
4. **డిశెంబరులో ఆయన జన్మదినం అనే మీ మానవ ఆచారం అబద్ధం**
   **– ఏతనీము 15వ తేదీ ఆయన జన్మదినం**
5. **డిశెంబర్ 31 వాచ్‌నైట్ సర్వీస్ అనే మీ మానవ ఆచారం అబద్ధం**
   **– ఆదారు అనే 12వ నెల ఆఖరిరోజుతో సంవత్సరం అంతం అవుతుంది**
6. **జనవరి 1 క్రొత్తసంవత్సరము అనే మీ మానవ ఆచారం అబద్ధం**
   **– నీసాను 1 క్రొత్త సంవత్సరము**
7. **మీరిచ్చే రొట్టె–ద్రాక్షారసం అనే మీ మానవ ఆచారం అబద్ధం**
   **– పస్కా అనునది ఆయన ఇచ్చిన ఆజ్ఞ**

– ఇలా చెప్పుకుంటూ వెళ్ళితే క్రైస్తవులు చేసే ఆచారాలన్నీ వాక్య విరుద్ధమే. అసలు క్రైస్తవ్యమే ఒక పెద్ద అబద్దాల పుట్ట. పెళ్ళిళ్ళ దగ్గర మీరు చేసే ఆచారసాంప్రదాయాలు తప్పు కావా? కట్నాలు తీసుకోవడం అన్యుల ఆచారం, అది మీరు వదలలేదే? లంచాలు తీసుకోవడం అన్యుల బుద్ధి, అదీ వదలలేదే? త్రాగుడు, వ్యభిచారం, మోసం, అన్నీ క్రైస్తవులలో కనిపిస్తూనే ఉన్నాయి. అల్లుళ్ళను ఒక చూపు కొడుకులను ఇంకోచూపు. కూతుళ్ళను ఒక చూపు కోడళ్ళను ఇంకోచూపు! అవన్నీ అన్యుల బుద్ధులు (ఆచారాలు) కావా? అవకాశం దొరకాలేగాని ఏదీ వదలరు, ఎక్కడా తగ్గించుకోరు గాని సత్యము విషయము దగ్గరికొచ్చేసరికి మాత్రం ఆచారమనడం ఎంత సమంజసమో మీకు మీరే స్వపరీక్ష చేసుకోండి. మీ వివాహ తేదీలు, మీ పుట్టుక తేదీలు, మీ వాళ్ళు చనిపోయిన తేదీలు: ఆ తేదీల్లో మీరు ఆడే నాటకాలు మీరు ప్రదర్శించే హంగు ఆర్భాటం ఆచారాలు కావా? పరమతండ్రి ఆచారములను వెక్కిరించకండి పతనమైపోతారు జాగ్రత్త.

**"పస్కా" రొట్టె మరియు సాధారణ రొట్టె:**

క్రైస్తవ బోధకులెవరికీ పస్కా రొట్టెకు సాధారణ రొట్టెకు తేడా తెలియదు. పస్కా రొట్టె సం॥రానికి ఒక్కసారే విరుస్తారు (నిర్గమ 13:10, లూకా 2:41) మెస్సీయ తన పరిచర్య $3^{1/2}$ సం॥రాలలో ఎన్నో రొట్టెలు విరిచి ప్రజలకు పంచినప్పటికీ అవి అన్నీ పస్కా రొట్టెలు కావు

1. 5000 మంది తినిన రొట్టెలు.................................... మత్తయి 14:15–21
2. 4000 మంది తినిన రొట్టెలు.................................... మార్కు 8:1–9
3. అపోస్తలుడైన సౌలు ఓడలో విరిచిన రొట్టె............................ అ॥కార్య 27:33–35
4. మెస్సీయ ఎమ్మాయి మార్గంలో విరిచిన రొట్టె........................లూకా 24:30–35
5. శిష్యులు ఇంటింటా విరిచిన రొట్టె.................................అ॥కార్య 2:46,47
6. సౌలు అర్ధరాత్రి తినిన రొట్టె....................................అ॥కార్య 20:7–12
7. అనుదిన ఆహారము (రొట్టె)....................................మత్తయి 6:11
8. క్షయమైన ఆహారము (రొట్టె)....................................యోహాను 6:26,27

మొదలగు ఇవన్నీ సాధారణ రొట్టెలు. ఇవి పస్కాకు సంబంధించిన రొట్టెలు కావు.

**మరి పస్కా రొట్టె ఎక్కడుందంటారా?**

1. మత్తయి 26:6............................................... పస్కా రొట్టె
2. మార్కు 14:22...............................................పస్కా రొట్టె
3. లూకా 22:19...............................................పస్కా రొట్టె
4. యోహాను 13:26...............................................పస్కా రొట్టె
5. 1కొరింథీ 11:23............................................... పస్కా రొట్టె

ఈ పస్కా రొట్టె యషువ మెస్సీయ శరీరమునకు సాదృశ్యం. ద్రాక్షారసము ఆయన రక్తానికి సాదృశ్యం. పాద ప్రక్షాళన ఉంది. ఈ పస్కా రొట్టె తినుటకు ముందుగా ఒకరి పాదములను ఒకరు కడుగుకోవలసినదిగా మెస్సీయ ఆజ్ఞాపించాడు. యోహాను 13:14,15. ఒకరి పాదములు ఒకరు కడుగుట అనే అలవాటు క్రైస్తవ సంఘాలలో మచ్చుకైనా కనబడదు అంటే మెస్సీయ మాటకు అసలు విలువ లేదన్నమాట. ఇంటింటా రొట్టె విరిచారని ఒకడు, ఆదివారం రొట్టె అని మరొకడు, ఎవడి ఇష్టం వచ్చిన రీతిలో వాడు ఈ పస్కాను మరుగు చేసి నాటకాలు ఆడుతున్నారు. వాక్యమును సరిగా విభజించలేని దొంగబోధకులు పాస్టర్లుగా చలామణి అవ్వుతూ క్రైస్తవులనందరినీ మోసంలో ముంచివేసారు. క్రైస్తవ మతశాఖల్లో అనేకమంది ఆరితేరిన అబద్ధబోధకులు ముఖ్యంగా క్రీస్తు సంఘమనే మతశాఖవారు, హెబ్రోన్ గ్రూపువారు, మరియూ కొంతమంది మతశాఖలవారు అ॥కార్య 20:7 వచనం తీసుకొని విశ్వాసులను తప్పుదారి పట్టించారు. అసలీ వచనం కొన్ని ఇంగ్లిష్ బైబిళ్ళలో ఏమని ఉందో పరిశీలించండి. శనివారం రాత్రి అని ఉంది. కొన్ని ఇంగ్లిష్ బైబిళ్ళలో ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు అని ఉంది. ఇంతకీ ఇలా రెండు విధాలుగా వ్రాయబడినదానిని మనం అర్థం చేసుకోవడం ఎలా అంటే: అనేకమైన బైబిలు తర్జుమాలలో ఈ వాక్యము అపోస్తలులు సబ్బాతు దినమున, సబ్బాతు జరిగిపోయిన సాయంత్రమున అనగా శనివారము రాత్రి కూడుకున్నట్లు తెలియపర్చుచున్నది.

## అ॥కార్య 20:7 అనేకమైన తర్జుమాలలో:

1. **ది న్యూ ఇంగ్లిష్ బైబిలు:**
   "శనివారము రాత్రి మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు సౌలు మరునాడు వెళ్లనైయుండి...."
2. **కాంకార్డెడ్ వెర్షన్:**
   "సబ్బాతు దినములలో ఒక దినమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు...."
3. **ది న్యూటెస్ట్‌మెంట్ బై విల్లియం బార్క్లీ:**
   "శనివారము సాయంత్రమున మేము భోజనము చేయుటకు కూడినప్పుడు...."
4. **గుడ్‌న్యూస్ ఫర్ మోడరన్ మేన్:**
   "శనివారము సాయంత్రమున మేము సహవాస భోజనమునకు కూడినప్పుడు...."
5. **డయాగ్లాట్: (ఒక ఇంటర్ లైనర్ ట్రాన్స్‌లేషన్ బై బెన్ విల్సన్)**
   "సబ్బాతులలో మొదటన, మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు...."
6. **ది కింగ్‌డమ్ ఇంటర్‌లైనర్ ట్రాన్స్‌లేషన్ ఆఫ్ ది గ్రీక్ స్క్రిప్చర్స్:**
   "సబ్బాతులలో ఒక సబ్బాతున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు..."
7. **న్యూ ఇంటర్‌నేషనల్ వెర్షన్ ఇంటర్‌లైనర్ గ్రీకు/ ఇంగ్లిష్ న్యూటెస్ట్‌మెంట్:**
   "సబ్బాతులలో ఒక సబ్బాతున మేము కూడినప్పుడు...."
8. **ది ఇంటర్ లైనర్ హీబ్రూ/గ్రీకు ఇంగ్లీష్‌బైబిలు:**
   "సబ్బాతులలో ఒక సబ్బాతున మేము రొట్టెవిరుచుటకు కూడినప్పుడు........."
9. **ది జూయిష్ న్యూ టెస్ట్‌మెంట్:**
   "శనివారము రాత్రి మేము రొట్టెవిరుచుటకు కూడినప్పుడు......."
10. **ఫెర్రర్ ఫెంటన్ వెర్షన్:**
    "సబ్బాతులలో మొదటన మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు....."
11. **నోగ్రేటర్ లవ్ బై రుచుంగా పొడైట్:**
    "శనివారము సాయంత్రమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు...."
12. **హెూలీబైబిల్ ఈజీ టు రీడ్ వెర్షన్ బై డబ్ల్యూ.బి.టి.సి:**
    "శనివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు..."
13. **ది న్యూటెస్ట్‌మెంట్ ఇన ది లాంగ్వేజ్ టుడే: బై విలియం ఎఫ్. బెక్:**
    "శనివారమున మేము భోజనము చేయుటకు కూడినప్పుడు...."

యూదుల కాలమాన ప్రకారం ఆదివారం అంటే శనివారం సాయంకాలం నుండి, సూర్యాస్తమయము నుండి ప్రారంభమవుతుంది. ఈ క్రింది చార్టు పరిశీలించండి.

| శనివారం సాయంకాలం (ఆదివారం మొదలు) | ఆదివారం పగలు |
|---|---|
| - సౌలు రొట్టె విరుచుట అంటే ఆహారము తినుట<br>- అర్ధరాత్రి వరకూ ప్రసంగించుట<br>- మేడ గదిలో అనేక దీపములుండుట<br>- ఐతుకు మూడవ అంతస్తు నుండి పడిపోవుట<br>- సౌలు క్రిందికి వెళ్ళి అతనిని పైకి తెచ్చుట<br>- మరళా రొట్టె విరిచి అంటే ఆహారము తినుట<br>- తెల్లవారు వరకూ విస్తారముగా సంతోషించుట | - సౌలు తెల్లవారిన తర్వాత బయలుదేరుట<br>- సహెూదరులను అస్సులో కలుసుకొనుట<br>- ఓడ ఎక్కి మితులేనేకు వెళ్ళుట<br>**గమనిక:**<br>సౌలు ఆదివారం పగలు ఎక్కడ విరిచాడు రొట్టె? ఎక్కడ చేసాడు ఆదివారం ఆరాధన? |
| ఆ ది వా రం | |

అందువలనే శనివారం రాత్రి అని, ఆదివారం అని వ్రాయబడింది. దీని గ్రహింపులేని అబద్ధబోధకులు, వాక్యమెరుగని అమాయక విశ్వాసులను అడ్డంగా మోసం చేస్తూ వారిని నరకానికి పంపిస్తున్నారు. అయోగ్యంగా తింటున్నారు, త్రాగుతున్నారు గనుకనే అనేకులైన క్రైస్తవులు బలహీనులు, రోగులుగా జీవిస్తున్నారు. విశ్వాసులారా! నేడైనా ఈ సత్యమును మీరు గ్రహించి దుర్భోధకుల వారం వారం రొట్టె–ద్రాక్షారసం కార్యక్రమం నుండి బయటకు రండి. వాక్యంలో అజ్ఞానులుగా ఉండక జ్ఞానము కలిగి జీవించండి. మెస్సీయను నమ్మిన యూదులు వ్రాసుకున్న క్రొత్తనిబంధనలో ఈ వాక్యం ఎలా ఉందో మీరే చూడండి.

**Acts 20:7** And on Yom Rishon, when we met for tish (*it was Motzoei Shabbos when there was a Melaveh Malkeh communal meal*), Rav Sha'ul was saying a shiur to them, since he would have to depart early the next day and washaving to extend the message until chatzot halailah

***-Orthodox Jewish Bible***

### పస్కా యొక్క విలువ తెలియని క్రైస్తవులు పస్కా ఆచరించువారిని విమర్శించుట తగునా?

### "పస్కా" ఆచరించకపోతే:

1. ఆయన సమాజంలో నుండి కొట్టివేయబడతారు..............................సంఖ్యా 15:30,31
2. ఆయనతో పాలుపంపులు ఉండవు.........................................యోహాను 13:4-9
3. తప్పక హాజరు అవ్వవలసిన ఆజ్ఞ............................................ద్వితీ 16:16
4. సాకులకు, సంశయాలకు క్షమాపణలేనిది....................................హెబ్రీ 10:26,27
5. నిత్యజీవము ఉండదు, అంత్యదినమున జీవమునకు లేపబడరు............... యోహాను 6:54
6. ఆజ్ఞాతిక్రమము క్షమించరానిది.................................................యోహాను 13:
7. అన్ని సమాజములు ఆచరించవలసినదే. 1కొరింథీ 4:17, 7:17, 14:33, 2కొరింథీ 11:28

గనుక ప్రియ సహెూదరుడా! ప్రియ సహెూదరీ! పస్కాలో పాలుపొందండి. **పస్కా ఈ సంవత్సరము ఏప్రిల్ 17 రాత్రికి వచ్చినది. గనుక మీరంతా వచ్చి పస్కాలో పాలువంపులు పొందవలసినదిగా ప్రేమపూర్వకముగా ఆహ్వానించుచున్నాము.**

గమనిక:- **పస్కాకు వచ్చువారు అందరూ తెల్లని వస్త్రములు ధరించవలెను. పరలోక సైన్యసమూహము (ప్రకటన 19:14) తెల్లని వస్త్రములు ధరించినవారై యున్నారు. ఎల్లప్పుడు తెల్లని వస్త్రములు ధరించుకొనుమని ప్రసంగి 9:8 ఋజువుచేయుచున్నది. తెల్లని వస్త్రములు పరిశుద్ధతకు సాదృశ్యము గనుక పరిశుద్ధుల పండుగలలో అందరూ ఆ క్రమమును పాటించవలెను.**

**దూరమునుండి వచ్చువారు ముందుగా మాకు తెలియపర్చవలెను. బాప్తీస్మము పొందువారు .ముందుగా రావలసి ఉంటుంది. అందరూ సమాజక్షేమాభివృద్ధి కొరకు మాతో సహకరించగలరని ఆశిస్తున్నాము.**

**ఫ్రీ ఫోన్ ఫెసిలిటీ ఆఫర్**

– పాఠకులైన మీ కొరకు ఫ్రీ ఫోన్ ఫెసిలిటీ ఏర్పాటుచేసాము. 92989 03470 కి మిస్డ్‌కాల్ ఇవ్వండి. మేమే మీకు ఫోన్ చేసి మాట్లాడతాము. భక్తిసంబంధమైన ఏ అనుమానములు, ప్రశ్నలు, సందేహములున్ననూ మమ్మును సంప్రదించండి

# క్రొత్తనిబంధన ఏ భాషలో వ్రాయబడింది

బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

**చా**లామంది చెప్పేది, నమ్మేది ఏమంటే: క్రొత్త నిబంధన గ్రీకు భాషలో వ్రాయబడిందని. మన తెలుగు బైబిలు కూడా అదే చెప్తుంది. **"ఇది ఆదిమ హెబ్రీ గ్రీకు భాషలలోనుండి భాషాంతరము చేయబడినది"** అని మన బైబిలు మొదటి పేజీలో వ్రాసారు. పాత నిబంధన గ్రంథము అంటే 39 పుస్తకములు హెబ్రీలోను, క్రొత్త నిబంధన అంటే 27 పుస్తకములు గ్రీకులో వ్రాయబడినవి అని నమ్ముట సర్వసామాన్యము. కాని తర్వాత తర్వాత పరిశీలకులు వాస్తవాలను పరిశీలిస్తున్నప్పుడు కనుగొన్న విషయమేమిటంటే: మత్తయి సువార్త పూర్తిగా హెబ్రీలో వ్రాయబడినట్లు, అటులనే పాతనిబంధనలోని కొన్ని పుస్తకములు (రెండు లేక మూడు పుస్తకములలోని కొన్ని భాగములు) అరామయిక్ భాషలో వ్రాయబడెనని నమ్ముచున్నారు. క్రొత్త నిబంధన మాత్రం గ్రీకు అనే ఇప్పటి వరకూ నమ్మడం జరిగింది. అయితే మెస్సీయకు పూర్వం 200–250 సంవత్సరాల మధ్యలో పాతనిబంధనను/తోరాను/39 పుస్తకములను 70 మంది రబ్బీలు కలిసి గ్రీకులో తర్జుమా చేయడం జరిగింది. దానినే సెప్టుజెంట్ (LXX) అంటున్నారు. అంటే యూదులు హెబ్రీని ఎలాగయితే చదివి వ్రాయగలిగారో అదే విధంగా గ్రీకు కూడా చదివి వ్రాయగలిగేవారని తెలుస్తుంది. (అ॥కార్య 6:1) మెస్సీయను మ్రానుకెక్కించినప్పుడు **"యూదుల రాజైన నజరేయుడగు యషువ మెస్సీయ"** అనే విలాసము మూడు భాషలలో వ్రాయించి మ్రానుపై పెట్టుట జరిగినది. అది మూడు భాషల్లో (హెబ్రీ, గ్రీకు, రోమా) వ్రాయబడినట్లు యోహాను 19:20 ఋజువు పరుస్తున్నది. దీనిని బట్టి కూడా అక్కడ మూడు భాషలు తెలిసినవారు, లేక మాట్లాడువారు లేక మూడు జనాంగములు ఉన్నట్లు అర్థము అవ్వుచున్నది. మొదటిగా హెబ్రూ, రెండవదిగా గ్రీకు, మూడవదిగా రోమా/లాటిన్: ఎక్కువగా హెబ్రీ భాషకే ప్రాముఖ్యత ఉన్నట్లు తెలుస్తుంది. అయితే రోమన్ కథోలిక్‌లు తయారుచేసిన సిలువ మీద మాత్రం ఒక్క భాషతో వ్రాయబడిన INRI అనేది మాత్రమే మనకు తెలుసు, మిగతా రెండు భాషలను వారు ఎత్తివేసారు. పిలాతు అయితే మూడు భాషల్లో వ్రాయించినట్లు యోహాను 19:20 ద్వారా మనకు ఋజువు అవుతుంది.

**హెబ్రీ: యషువహా నజ్రీ మెలెక్ హ యహుదిమ్**
**గ్రీకు : యషువ హ నజరోన్ హెూ బసిలియన్ ఐయోడయన్**
**రోమా: యషువ నజరీనస్ రెక్స్ ఇడోరమ్**

యషువ అనే ఆయన పేరు ఈసస్‌గా ఎలా మారింది? ఎందుకు మారింది? ఎవరు మార్చారు? ఎందుకు మార్చారు? అనునది ప్రశ్నార్ధకమయ్యింది. అప్పటినుండి పరిశోధనలు ప్రారంభం అయ్యాయి. ఆ పరిశోధనల ఫలితమే ఆయన అసలు పేరు యషువ మెస్సీయ అని ఋజువు అయ్యింది. మెస్సీయ శిష్యులందరూ అదే నామమును బోధించినట్లు చరిత్ర చెపుతుంది.

– కన్యమరియతో గాబ్రియేలు దూత మాట్లాడిన భాష హెబ్రీ
– యషువ మెస్సీయ సమాజమందిరంలో చదివిన తోరా హెబ్రీ
– యషువ మెస్సీయ సౌలుతో మాట్లాడిన భాష హెబ్రీ
– పిలాతు వ్రాయించిన విలాసము హెబ్రీ
– సౌలు యూదులతో మాట్లాడినది హెబ్రీ
– అనేకమైన హెబ్రీ పదములు మనకు క్రొత్తనిబంధనలో కానవచ్చుచున్నవి.

గనుకనే క్రొత్తనిబంధన హెబ్రీలోనే వ్రాయబడినదని, తర్వాత అది గ్రీకులోనికి తర్జుమా చేయబడినదని నమ్ముచున్నారు. కాదు, కాదు యషువ మెస్సీయ దినాలలో హెబ్రీ కేవలం సమాజమందిరాల వరకే పరిమితం గాని ఆయన అరామయిక్ భాషలోనే మాట్లాడాడు అనే వాదన ఉంది. అరామయిక్ కూడా హెబ్రీలాగే ఉంటుంది. కొద్దిపాటి తేడా తప్ప హెబ్రీ – అరామయిక్ ఇంచుమించు ఒకే రకంగా ఉంటుంది. అయితే అరామయిక్ బైబిల్లో ఆయన పేరును యెషువ మెస్సీయ అని వ్రాసారు. హెబ్రీలో యషువ హ మెషియాక్. ఇప్పుడు తర్జుమాదారులు ఆయన పేరుతో ఎలా ఆడుకున్నారో చూద్దామా?

– హెబ్రీ భాషలో : యషువ హ మెషియాక్
– అరామయిక్ లో : యెషువ మెస్సీయ
– లాటిన్ వల్గేట్‌లో : ఈసు క్రిస్టి
– జాన్ విక్లిప్ బైబిల్లో : యెషు క్రిస్ట్
– గ్రీకు బైబిల్లో : ఈసోస్ క్రిస్టోస్

ఇలా రకరకాలుగా ఆయన పేరును మార్పు చేసుకుంటూ వచ్చారు. ఏమిటిది? ఎలా ఇది? ఎందుకు ఇది? అని ఎవరైనా నిలదీసి అడిగితే: ఆ భాషలో అది, ఈ భాషలో దీనికి అర్థం ఇది అని ఏవేవో సాకులు చెప్తున్నారు. చరిత్రను కాదనే అధికారం ఎవ్వరికీ లేదు. మనం ఎంతసేపూ నూతిలో కప్పలా ఆలోచించడం మానేసి, ఎగిరే పక్షిలా కొంచెం ప్రపంచపరంగా ఆలోచిస్తే సత్యాన్ని చాలా చక్కగా, తొందరగా, మంచిగా అర్థం చేసుకోగలము. The Passion of the Christ అనే సినిమాను చూడని, ఎరుగని క్రైస్తవులు ఉండరు. అందులో మరియమ్మ తన కుమారున్ని యషువా అని పిలుస్తుంది. నిజంగా ఆయన నిజమైన నామం యషువ. ఈసోస్, జీసస్, యేసు, ఈసు, ఈసా మొదలగునవి ఆయన పేర్లు కావు. అవి మానవులు తర్జుమా రూపంలో యిచ్చిన తప్పుడు పేర్లు. ఈ పేర్లలో రక్షణ లేదు, ఉండదు.......................................................అ॥కార్య 4:12

మెస్సీయ శిష్యులందరూ ఆయనను యషువ మెస్సీయ అనే పిలిచారు. అదే నామంలో బాప్తీస్మములిచ్చారు. అదే నామమును ప్రపంచానికి సువార్తగా చాటిచెప్పారు. అయితే ఈ రకరకాల నామములు ఎలా వచ్చాయో, ఏ ఏ కాలంలో ఈ నామములు అవతరించాయో, వీటి విషయమై చరిత్ర ఏమి చెప్తుందో ఒకసారి చూస్తారా!

– మొదటి శతాబ్దంలో అనగా మెస్సీయ శిష్యుల కాలంలో అంటే AD31–100 వరకూ ఆయన నామం యషువ మెస్సీయయే
– ఆఖరికి అరామయిక్ భాషలోని బైబిల్లో సహితం ఆయన పేరు యెషువా మెస్సీయ అనే వ్రాయబడింది.
– గ్రీకుకి వచ్చేసరికి ఈసోస్ క్రిస్టోస్ అయ్యింది? కాదు అలా ఆయన పేరు మార్చివేయబడింది.
– ప్రపంచంలోని బోధకులందరికీ ఇది తెలిసిన విషయమే: అదేమంటే 1380లో జాన్‌విక్లిఫ్ అనే ఆయన బైబిలును చేతి వ్రాతతో ఇంగ్లిషులోనికి తర్జుమా చేసాడు. ఆ బైబిల్లో ఆయన పేరు Ihesu Crist అని వ్రాసాడు. దాని తరువాత వచ్చిన బైబిల్స్‌లో ఆయన పేరు ఎలా వ్రాయబడిందో మీరే చూడండి, చదవండి.

1) 405 బిబ్లియా సేక్రావల్గేటా.............................. Iesu Christi
2) 5th CENలాటిన్ వల్గేట్ 5th Cen (Jerome Bible)........ Iesu Christi
3) 1380 జాన్ విక్లిఫ్.......................................... Ihesu Crist
4) 1525 విలియంటిండేల్...................................... Iesus Christ
5) 1535 మైల్స్ కొవర్‌డేల్.................................... Iesus Christ
6) 1568 బిషప్స్ బైబిల్........................................ Iesus Christ
7) 1587 జెనెవా బైబిల్......................................... Iesus Christ
8) 1611 కింగ్ జేమ్స్ వెర్షన్................................... Iesvs Christ
9) 1729 డేనియల్ మేస్........................................ Jesus Christ
10) 1755 జాన్ వెస్లీ............................................ Jesus Christ
11) 1712–1953 బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా.............యేసు క్రీస్తు (తెలుగు)
12) 1712–1953 బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా.............ఈసా మస్సీ (హిందీ)
13) 1712–1953 బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా.............తమిళ్ (........)

ఇలా భాష భాషకు ఆయన పేరును మార్చివేస్తూ కోట్ల రూపాయలతో వ్యాపారం చేసే బైబిల్ సొసైటీ వారిని అడగండి. భాష భాషకు పేరు ఎలా మారిపోతుందో? ఎందుకు మార్చుతున్నారో? రీసెంట్‌గా అదే బైబిల్ సొసైటీ వారు **"అధ్యయన బైబిలు"** రిలీజ్ చేసారు. దాని ఖరీదు రూ. 550/– అందులోని 1400 పేజీలోని 1:21 కి ఫుట్ నోట్‌లో చూడండి. ఆయన పేరు **యెషువ** అని వ్రాసారు. బైబిల్ సొసైటీవారు వారి ఇష్టం వచ్చినట్లు భాష భాషకు పేరును మార్పుచేసి ప్రింట్ చేస్తుంటే ప్రజలు ఎందుకు వారిని నిలదీయరు? ఎందుకు వారిని అడగరు? నిలదీసి అడగండి. మేము అడిగాము వారు మాకు వ్రాసినది పత్రికలో ప్రకటించాము.

గనుక ప్రియ సహెూదర, సహెూదరీల్లారా! ఆయన పేరు యషువ మెస్సీయ. అదే నామమును అపోస్తలులు

బోధించినారు. ఆ నామములోనే బాప్తీస్మములు ఇచ్చినారు. అది ఆది అపోస్తలుల క్రమము. ఎఫెసీ 2:20, 1కొరింథీ 3:10. వేయబడిన పునాది తప్ప వేరొక పునాది ఎవడునూ వేయరాదు 1కొరింథీ 3:11., యెహోషువ 22:19. మొదట శతాబ్దపు బోధ కానిచో మీరు అబద్ధబోధకుల బోధలలో ఉన్నట్లే. గనుక ఒకసారి స్వపరీక్ష చేసుకొని, మీ విశ్వాసమును కాపాడుకోండి. అపోస్తలులు అంతా హెబ్రీలోనే మాట్లాడారు. అది వారి మాతృభాష. అపోస్తలుడైన సౌలు హెబ్రీలోనే మాట్లాడాడు అ॥కార్య 22:2, 21:40, యషువ మెస్సీయ కూడా హెబ్రీ భాషలోనే సౌలుతోమాట్లాడాడు అ॥కార్య 26:14, గనుక క్రొత్త నిబంధన మొదటిలో హెబ్రీలోనే వ్రాసారు అని నమ్మవలసి ఉంది. తదుపరి అది అరామయిక్, లాటిన్ వల్గేట్, గ్రీకు, ఇంగ్లీషు మొదలగు భాషలకు తరువాత అనువాదం చేయబడినది అనుట సత్యము. 17వ శతాబ్దము వరకు జీసస్ క్రైస్ట్ అనే పదము ఎవరికీ తెలియదు. 16వ శతాబ్దము వరకు ఈసస్ క్రైస్ట్ అని మాత్రమే వ్రాయబడినది. యేసు క్రీస్తు అను పేరు తెలుగు బైబిలు తర్జుమాదారుడైన ఆనందరాయర్ అనే కన్వర్టెడ్ బ్రాహ్మిన్ ద్వారా విలియం కేరి వ్రాయించాడు. అది మనుష్యుడు పెట్టిన పేరు గాని పరమతండ్రి వ్రాయించిన పేరు కాదు. కనుక ఆలోచించి సత్యమును గ్రహించడానికి మీ మనస్సును స్థిరపరచుకోండి.

## ఆది అపోస్తలుల కాలంలో అబద్ధబోధకులు?

క్రైస్తవలోకంలో ఎన్నో మిషనులు, గ్రూపులు, సహవాసములు, డినామినేషనులు ఉన్నాయి. ప్రతీగ్రూపువారు **"అబద్ధబోధకులున్నారు జాగ్రత్త"** అని హెచ్చరించేవారే. విశ్వాసులు, బోధకులు చెప్పే ప్రతీదానికి తల ఊపడమేగాని, విషయాన్ని సీరియస్‌గా తీసుకుని వాక్యప్రకారం అవునో కాదో తెల్సుకుంటే ఎవరు అబద్ధబోధకులో తేలిపోతుంది. మెస్సీయ తర్వాత అపోస్తలులే మనకు మాదిరి, క్రమం, గనుక అపోస్తలుల కాలంలోని అబద్ధబోధకులే నేడు మనకి అబద్ధబోధకులు. కావున లేఖనాల ద్వారా వారిని పరిశీలిద్దాం. అపోస్తలులను, వారి బోధలను ఎదిరించిన గుంపులు ఇప్పుడు చూద్దాం.

1. **యషువనామమును బట్టి మాట్లాడకూడదనే గుంపు: అ॥కార్య 4:18, 5:28, 5:40**

అపోస్తలులంతా యషువ మెస్సీయ నామం కొరకే బోధించారు. ఆ నామం కొరకే హింసలు పొందారు. ఆ నామంలోనే రక్షణ ఉందని చాటించారు. ఆఖరికి ఆ నామంలోనే బాప్తీస్మములు కూడా ఇచ్చారు. ఈ వచనాలన్నీ చదవండి. అ॥కార్య 4:12, 5:41, 2:38, 18:48, 19:5

**కాబట్టి ఈనాడు యషువ మెస్సీయ నామంలో బాప్తీస్మమును తప్పు అని, యషువ నామము అబద్ధబోధ అనెడివారు అబద్ధబోధకులు.**

2. **మృతుల పునరుత్థానం నమ్మని గుంపు: అ॥కార్య 4:2, మత్తయి 22:23-33, అ॥కార్య 17:18,32, 23:8, 24:14, 2తిమోతి 2:17,18.**

అపోస్తలులంతా మృతులపునరుత్థానాన్ని నమ్మారు, బోధించారు. 2థెస్స 4:13-18, 1కొరింథీ 15:12-58, హెబ్రీ 11:35

**కాబట్టి మృతుల పునరుత్థానం నమ్మనివారు అబద్ధబోధకులు.**

3. **సున్నతి పొందితేనే రక్షణ లేనియెడల రక్షణలేదనే గుంపు: అ॥కార్య 15:1,5, 11:1-3.**

అపోస్తలులంతా అన్యజనులకు సున్నతి అవసరం లేదని (అ॥కార్య 15:19-32) బోధించారు. ముఖ్యంగా దాని విషయమై రోమా, గలతీ, ఫిలిప్పి పత్రికలు వ్రాయబడ్డాయి, సౌలు వీరి విషయమై జాగ్రత్తపడమన్నాడు. ఫిలిప్పీ 3:2,3., కొలస్సీ 3:11, తీతు 1:10-15. ధర్మశాస్త్రసంబంధమైన నీతి (సున్నతి వలన ఎవడూ నీతిమంతుడుగా తీర్చబడడని రోమా 3:20, గలతీ 2:16) ఋజువు చేయుచున్నవి. గనుక సున్నతి అవసరంలేదని బోధించారు. అ॥కార్య 15:23-29, గలతీ 5:6

**కాబట్టి సున్నతి పొందాలనేవారు అబద్ధబోధకులు**

4. **యషువయే మెస్సీయ అని నమ్మని గుంపు: 1యోహాను 2:22**

యూదులంతా యషువను మెస్సీయగా నమ్మలేదు. వడ్లవాని కుమారుడని, బెయెల్జెబూలనీ, మనుష్యుడని, వెఱ్ఱివాడనీ, ప్రవక్తని, నమ్మారేగాని యషువయే మెస్సీయ అనిగాని, శరీరము ధరించి వచ్చిన యావె అని నమ్మలేదు. గనుకనే అపోస్తలులంతా యషువయే మెస్సీయ అని బోధించారు. 1యోహాను 4:15, 5:1, అ॥కార్య 5:42, 9:20,22, 17:3, 18:5+28.

**కాబట్టి యషువయే మెస్సీయ అని నమ్మని వారు అబద్ధబోధకులు**

5. **తండ్రిని కుమారుని ఒప్పుకొనని వీరే మెస్సీయ విరోధి గుంపు: 1యోహాను 2:23, 18:19. 2యోహాను 9**

యూదులు ఒకే ఒక ఎలోహీంని (తండ్రిని) ఒప్పుకున్నారేగాని, కుమారుడిగా వచ్చిన తండ్రిని అంగీకరించినవారు కారు. అందుకే అపోస్తలులంతా తండ్రిని మాత్రమే కాదు తండ్రిగా వచ్చిన కుమారుని కూడా అంగీకరించవలసిఉంది. అలా అంగీకరించని వీరే మెస్సీయ విరోధులు అని బోధించారు. కీర్తనలు 1:12, 1యోహాను 4:15, 5:10-13+20. యషువయే శిశువు, కుమారుడు, ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన ఎలోహీం, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి..యెషయా 9:6

**గనుక తండ్రిని కుమారుని (1యోహాను 2:23) అంగీకరించనివారు అబద్ధబోధకులు**

6. **యషువ మెస్సీయ శరీరధారియై వచ్చెనని నమ్మని వంచకుల గుంపు: 1యోహాను 4:1-3, 2యోహాను 7,8.**

యషువ మెస్సీయ అంటే వాక్యము యోహాను 1:1. ఆ వాక్యమే ఎలోహీంయై ఉండెను. ఆ ఎలోహీం శరీరధారియై కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివశించెను, 1:14 ఆత్మయైయున్న ఎలోహీం శరీరం ధరించి వచ్చాడని నమ్మని వంచకులు ఈనాడు కూడా ఎందరో ఉన్నారు. వీరే అబద్ధ బోధకులు.

**గనుక ఎలోహీం శరీరధారియై వచ్చెనని నమ్మని వంచకులు అబద్ధబోధకులు**

7. **ధర్మశాస్త్ర సంబంధమైన నీతిని అనుసరించే యూదుల గుంపు: (బలుల, నైవేద్యములను గూర్చి) రోమా 3:20,28, అ॥కార్య 13:39).**

సత్యమును అంగీకరింపని యూదులు, ఇశ్రాయేలీయులు, మెస్సీయ గూడారఖర్మకాండ ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడని ఎరుగక, ఇంకనూ మేకలయొక్కయూ, కోడెలయొక్కయూ రక్తము వలననే నీతి కలుగునని వాటిని బలి ఇచ్చుచున్నారు. అపోస్తలులంతా అది కొట్టివేయబడినది, క్రొత్తనిబంధనా రక్తము మెస్సీయయే అని, తద్వారానే నీతిమంతులూ తీర్చబడుచున్నామని బోధించారు. 1యోహాను 1:7, హెబ్రీ 10:29, 2కొరింథీ 3:14-16 పాతనిబంధన రక్తం ముసుగులో యున్న యూదులను యషువ రక్తంవైపుకు మళ్ళించారు. అపోస్తలులు లోక పాపములను తీసివేయు ఎలోహీం గొఱ్ఱెపిల్లయైన యషువ రక్తమునందే రక్షణ, నీతి అని చాటించారు. అ॥కార్య 13:38,39.

**గనుక ధర్మశాస్త్రసంబంధ బలులు అర్పించేవారే అబద్ధబోధకులు**

వీరు తప్ప అపోస్తలుల కాలంలో అబద్ధబోధకులు లేరు. మరి నేటి పరిస్తితి ఏమిటి? మీరే యోచించుకోండి

## సువార్తకు అడ్డుబండలు విశ్వాసులు, సువార్తికులే

నా పక్షమున నుండని వాడు నాకు విరోధి; నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడు (మత్తయి 12:30, లూకా 11:23) అని మెస్సీయ అంటున్నాడు. సువార్తకు శత్రువు ఎవరు అనగానే సాతాను అని మనమంతా వెతుక్కోకుండా చెప్పేస్తాము కాని చూడండి సువార్తకు ఎవరు శత్రువులుగా ఉంటున్నారో?

1. ఒకసారి కొందరు చిన్నపిల్లలను యషువ మెస్సీయ నొద్దకు తీసుకుని వచ్చి వారిని దీవించాలని కోరినప్పుడు, యషువ శిష్యులు వారిని గద్దించి వెలుపలకు పంపించెయ్యడానికి ప్రయత్నించారు. (మత్తయి 19:13-15, మార్కు 10:13-16, లూకా 18:15-17)
2. యషువ మెస్సీయ గొప్ప సమూహము మీద కనికరపడి భోజనము పెడదామని ఆయన చూస్తుంటే ఆయన శిష్యులు వారిని పంపించెయ్యమని సలహా చెప్తున్నారు మత్తయి 14:14,15, మార్కు 6:35,36, లూకా 9:11,12
3. యషువ మెస్సీయ తనకు కలుగబోయే శ్రమలను, హింసలను గూర్చి చెపుతుంటే కేఫా (పేతురు) తండ్రి చిత్తము నెరుగకుండా సాతాను ప్రేరేపణకు లోబడి ఆయనను గద్దిస్తున్నాడు మత్తయి 16:21-23, మార్కు 8:31-33
4. రూపాంతర కొండదగ్గర దర్శనం చూసిన పేతురు ఇక్కడే ఉండిపోదాం నీకిష్టమైతే పర్ణశాలలు కడతాను అంటున్నాడు. (మత్తయి 17:3,4, మార్కు 9:5, లూకా 9:33) పేతురు ఏమి చెపుతున్నాడో తనకే తెలియదు.
5. యషువ మెస్సీయ నామంలో ఒకడు దయ్యములను వెళ్ళగొట్టుట చూచిన శిష్యులు, అతడు వారిని వెంబడించుటలేదని అతనిని ఆటంకపరుస్తున్నారు. (మార్కు 9:38-40, లూకా 9:49-50).
6. యషువ మెస్సీయను చేర్చుకోవడానికి యిష్టపడని సమరయులను చూచి ఆకాశమునుండి అగ్నిదింపి నాశనం చేయడం నీకిష్టమా? అని ఆయనను శిష్యులు అడుగుతున్నారు (లూకా 9:52-55)
7. యషువ మెస్సీయ కోసం ఒక స్త్రీ అత్తరు తెచ్చి ఒక మంచి కార్యముచేయుచుండగా ఆయన శిష్యులు - ఈ నష్టమెందుకు అని కోపపడుచున్నారు (మత్తయి 26:6-13, మార్కు 14:3-9, యోహాను 12:3-8).
8. యషువ మెస్సీయ ఒక తల్లి చేసిన మనవికి ఎంతో మృదువుగా సమాధానం చెప్పి పంపించగా ఆయన శిష్యులు వారి మీద కోపపడుచున్నారు (మత్తయి 20:20-28, మార్కు 10:35-45).
9. యషువ మెస్సీయకు ఎదురైన సమస్యలలో ఆయన శిష్యులు కత్తి ఉపయోగించారు (మత్తయి 26:50,51, మార్కు 14:47) కత్తితో నరుకుదామా అని ఆయనను అడుగుతూనే కత్తితో ఒకని చెవిని నరికారు లూకా 22:49-52
10. అలాగైతే ఎవడు రక్షణ పొందగలడు? (మత్తయి 19:25) అని రక్షకుడ్ని దగ్గర పెట్టుకుని అడుగుతున్నారు. పైన చూపిన ఉదాహరణలన్నిటిలోనూ యషువ మెస్సీయ శిష్యులు యషువ మెస్సీయ ఆత్మను ఎరుగక, ఉద్దేశ్యమును ఎరుగక, గద్దించబడ్డారు. సిద్ధుడైన ప్రతివాడును తన బోధకునివలె ఉండును అని లూకా 6:40 చెప్తుంది. యషువ మెస్సీయ కూడానే ఉంటూ ఆయన మనస్సును, ఆయన ఆత్మను గ్రహించిన సిద్ధులైన శిష్యులు ఎక్కడ? ఆనాడు జరిగినదే ఈనాడు జరుగుతుంది.

అపోస్తలుల కాలంలో అపోస్తలులు యావెవాక్యము బోధించుటకే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చి (అ॥కార్య 6:2) వాళ్ళ బాధలు వారు పడుతూవుంటే, శిష్యులు సంఖ్య విస్తరించి భోజనాలదగ్గర విధవరాండ్రను చిన్నచూపు చూసిన సంగతులపై సణుగులు వినబడ్డాయి (అ॥కార్య 6:1), ఏదో ఒక్కొక్కచోట ఏదో ఒకొక సమస్య తలెత్తుతూనే ఉంటుంది. ఈ సమస్యలు సువార్తకు అడ్డుబండలుగా తయారవుతున్నాయి. సమాజము చేసే శాపగ్రస్త పనులనుబట్టి సమాజకాపరికి తలదించుకునే స్తితి (యెహోషువ 7:10-12) ఏర్పడుతుంది. నాయకులను దు:ఖపరిచేస్తితిలో విశ్వాసులు ఉంటే వాళ్ళు వర్ధిల్లరు (హెబ్రీ 13:17) భోజనముబట్టి ఎలోహీం పనిని పాడుచేయకండి (రోమా 14:20, హెబ్రీ 13:9) సువార్తకు అడ్డుబండలుగా జీవించకండి. సమస్య వచ్చినప్పుడు పరిష్కారం వెతుక్కోవడం పరమతండ్రి బిడ్డల లక్షణమైయుండగా, వెనక్కి వెళ్లిపోవడం లేదా విశ్వాసం వదులుకోవడం అనునది సాతాను ప్రేరేపణ.అపోస్తలుడైన సౌలు హెబ్రీయులకు చెప్తున్న మాటలను చదవండి (హెబ్రీ 10:32-39) నాగటి మీద చెయ్యిపెట్టి వెనక్కి తిరిగి చూడకూడదు (లూకా 9:62). వెనకున్న వాటిని మరచి ముందున్న వాటికై వేగిరపడాలి (ఫిలిప్పీ 3:13-15). ఐహిక విచారమువలన ధనమోసము వలన నిష్ఫలులము కారాదు (మత్తయి 13:22). శ్రమలు హింసలు కలుగగానే తొట్రిల్లిపోకూడదు (మత్తయి 13:21). అభ్యంతర పడిపోకూడదు సమస్యలకు ఎక్కువ ప్రాముఖ్యత యిచ్చి విశ్వాసమును పోగొట్టుకోకూడదు (హెబ్రీ 6:4-6). దేమా వలె (2తిమోతి 4:10) లోకంలో కలిసిపోకూడదు. సమస్యలను బూత అద్దాలతో చూసుకుంటూ సహవాసమును, సహోదరులను విడిచిపోకూడదు (2తిమోతి 4:16). ఈ విశ్వాసజీవితంలో ఎక్కడో ఏదో ఒక సమస్య తలెత్తుతూనే ఉంటుంది.

అయితే అపోస్తలుడైన సౌలు వలె మనం చెప్పగలిగే స్తితిలో ఉండాలి. దయతో ఈ వచనాలు చదివి (రోమా 8:35-39) మన మనస్సులను స్తిరపరచుకుందాం. సువార్తకు అడ్డుబండలుగా ఉండకుందుము గాక! సమస్య వచ్చినప్పుడు పరిష్కారం వెతుక్కోవడం పరమతండ్రి బిడ్డల మంచి లక్షణం

## విశ్వాసీ! నీవు ఏ కట్టులో ఉన్నావు?

పరిశుద్ధ గ్రంథం చాలా కట్లు గూర్చి మాటలాడుతుంది. అయితే ఆ కట్లలో నుండి నీవు బయటకు రావాలి. లేకపోతే నీకు పరలోకం ఉండదు. ఇందులో నీవు ఏ కట్టులో ఉన్నావో ఒక్కసారి స్వపరీక్ష చేసిచూడు:

**1) బంధుకట్టు:** ఈ ప్రజలు బందుకట్టు అని చెప్పునదంతయు బంధుకట్టు అనుకొనకుడి వారు భయపడుదానికి భయపడకుడి దానివలన దిగులుపడకుడి. యెషయా 8:12

**2) సంఘకట్టు:** వాని తల్లిదండ్రులు యూదులకు భయపడి ఆలాగు చెప్పిరి; ఎందుకనిన ఆయన క్రీస్తు అని యెవరైనను ఒప్పుకొనినయెడల వానిని సమాజమందిరములోనుండి వెలివేతుమని యూదులు అంతకుమునుపు నిర్ణయించుకొనియుండిరి. యోహాను 9:22. ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి తాము కూడియున్న యింటి తలుపులు మూసికొనియుండగా యషువ వచ్చి మధ్యనునిలిచి-మీకు సమాధానము కలుగునుగాక అని వారితో చెప్పెను. యోహాను 20:19

**3) కులకట్టు:** వారిలో ఒక భాగము సద్దూకయ్యులును మరియొక భాగము పరిసయ్యులునై యున్నట్టు సౌలు గ్రహించి-సహోదరులారా, నేను పరిసయ్యుడను పరిసయ్యుల సంతతివాడను; మనకున్న నిరీక్షణనుగూర్చియు, మృతుల పునరుత్థానమును గూర్చియు నేను విమర్శింపబడుచున్నానని సభలో బిగ్గరగా చెప్పెను. అతడాలాగు చెప్పినప్పుడు పరిసయ్యులకును సద్దూకయ్యులకును కలహము పుట్టినందున ఆ సమూహము రెండు పక్షములు ఆయెను. సద్దూకయ్యులు పునరుత్తానములేదనియు, యావెదూతయైనను ఆత్మయైనను లేదనియు చెప్పుదురు గాని పరిసయ్యులు రెండును కలవని యొప్పుకొందురు. అప్పుడు పెద్దగొల్లు పుట్టెను; పరిసయ్యుల పక్షముగా ఉన్న శాస్త్రులలో కొందరు లేచి - ఈ మనుష్యునియందు ఏ దోషమును మాకు కనబడలేదు; ఒక ఆత్మయైనను యావెదూతయైనను అతనితో మాటలాడియుంటే మాటలాడియుండవచ్చునని చెప్పుచు తగవులాడిరి. కలహమెక్కువైనప్పుడు వారు సౌలును చీల్చివేయుదురేమో అని సహస్రాధిపతి భయపడి- మీరు వెళ్లి వారి మధ్యనుండి అతనిని బలవంతముగా పట్టుకొని కోటలోనికి తీసుకొనిరండని సైనికులకు ఆజ్ఞాపించెను. అ॥కార్య 23:6:10

**4) కుటుంబ కట్టు:** ఆదాము చేసినట్లు నా దోషములను దాచిపెట్టుకొని మహా సమూహమునకు భయపడియు కటుంబముల తిరస్కారమునకు జడిసియు నేను మౌనముగానుండి ద్వారము దాటి బయలు వెళ్ళక రొమ్ములో నా పాపము కప్పుకొనిన యెడల పరమునన్న ఎలోహీం దృష్టికి నేను వేషధారి నవుదును. యోబు 31:33,34

**5) మతకట్టు:** ఏడు దినములు కావచ్చినప్పుడు ఆసియనుండి వచ్చిన యూదులు యావెఆలయములో అతని చూచి, సమూహమంతటిని కలవరపరచి అతనిని బలవంతముగా పట్టుకొని -ఇశ్రాయేలీయులారా, సహాయముచేయరండి; ప్రజలకును ధర్మశాస్త్రమునకును ఈ స్థలమునకును విరోధముగా అందరికిని అంతటను బోధించుచున్నవాడు వీడే. మరియు వీడు గ్రీసుదేశస్థులను యావెఆలయములోనికి తీసికొనివచ్చి యీ పరిశుద్ధ స్థలమును అపవిత్రపరచియున్నాడని కేకలు వేసిరి. అ॥కార్య 21:27-36

**6)అబద్ధబోధకుల కట్టు:** అయితే వారొకే పట్టుగా పెద్ద కేకలు వేసి, వీనిని మ్రాను వేయుమని అడుగగా..... లూకా 23:23

**7) ఊరు కట్టు:** ఆయన యరూషలేమునకు వెళ్ళుటకు మనస్సు స్థిరపరచుకొని తనకంటె ముందుగా దూతలను పంపెను. వారు వెళ్లి ఆయనకు బస సిద్ధము చేయవలెనని సమరయుల యొక గ్రామములో ప్రవేశించిరి గాని ఆయన యరూషలేమునకు వెళ్ల నభిముఖుడైనందున వారాయనను చేర్చుకొనలేదు. శిష్యులైన యాకోబును యోహానును అది చూచి-సర్వాధికారీ, ఆకాశమునుండి అగ్ని దిగి వీరిని నాశనము చేయునట్లు మేమాజ్ఞాపించుట నీకిష్టమా అని అడుగగా, ఆయన వారి తట్టు తిరిగి వారిని గద్దించెను.

ఇదిగో ఆ పట్టణస్తులందరు యషువను ఎదుర్కొనవచ్చి ఆయనను చూచి తమ ప్రాంతములను విడిచిపొమ్మని ఆయనను వేడుకొనిరి.మత్తయి 8:34

**8. రాజు కట్టు:** రాజగు నెబుకద్నెజరు నొద్ద ఈలాగు మనవి చేసి- రాజు చిరకాలము జీవించును గాక. రాజా, తాము ఒక కట్టడ నియమించితిరి; ఏదనగా బాకాను పిల్లంగ్రోవిని పెద్దవీణెను వీణెను విపంచికను సుంఫోనియను సకల విధములగు వాద్యధ్వనులను విను ప్రతివాడు సాగిలపడి ఆ బంగారు ప్రతిమకు నమస్కారము చేయవలెను దానియేలు 3:9,10

**9. పెద్దల కట్టు:** ఉదయమైనప్పుడు యూదులు కట్టుకట్టి, తాము సౌలును చంపువరకు అన్నపానములు పుచ్చుకొనమని ఒట్టు పెట్టుకొనిరి. ఈ కుట్రలో చేరినవారు నలుబదిమంది కంటె ఎక్కువ. వారు ప్రధానయాజకుల యొద్దకును పెద్దలయొద్దకును వచ్చి-మేము సౌలును చంపువరకు ఏమియు రుచి చూడమని గట్టిగా ఒట్టు పెట్టుకొని....అ॥కార్య 23:12-21

**10. మనుష్యుల కట్టు:** అయినను అధికారులలో కూడ అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి గాని, సమాజములో నుండి వెలివేయబడుదుమేమో యని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు. వారు ఎలోహీంను మెప్పుకంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా ఆపేక్షించిరి. యోహాను 12:42,43

**11. చావుకట్టు:** ఆయన ఆలాగు చెప్పి-లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా చనిపోయినవాడు, కాళ్ళు చేతులు ప్రేతవస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను; అతని ముఖమునకు రుమాలు కట్టియుండెను. అంతట యషువ - మీరు అతని కట్లు విప్పిపోనియ్యుడని వారితో చెప్పెను (యోహాను 11:43,44)

**కట్లు కట్టేవాళ్ళు సాతాను+సాతాను సంబంధులు. కట్టు విప్పేవాడు యషువ మెస్సీయ, ఆయన శిష్యులు**

## ప్రింటింగ్ స్పాన్సర్స్ కావలెను

ప్రియ పాఠకులకు షలోం. ఇదివరకు మనం ప్రింట్ చేసిన చిన్న కరపత్రములు చాలా చక్కగా ప్రజలలో పనిచేసినవి. వాటి ద్వారా అనేకమంది సత్యసంబంధులైన విశ్వాసులు, బోధకులు ఎంతో బలపడ్డారు, స్థిరపడ్డారు. అంతేకాకుండా అనేకమందికి బహుబలమైన వాక్యం అందించేవారిగా అనుభవము సంపాదించారు. ఆఖరికి వారి బైబిళ్ళలో ప్రసంగదీపికల్లా మన పత్రికలు ఉపయోగించుకుంటున్నారు. మనం ప్రింట్ చేసిన పత్రికలు తక్కువ మోతాదుల్లో ఉన్నప్పటికీ, వాటికి జెరాక్స్ తీసి పంచిన వారు ఎంతోమంది ఉన్నారు. వాక్యం ద్వారా ఎదిరించలేని తప్పుడుబోధకులకు వారు జెరాక్స్ తీసి పంపించి నోరు మయ్యించిన సంఘటనలు ఎన్నో మనకు తెలుసు. గనుక వాటినన్నిటినీ మరలా మనం రీప్రింట్ చేయవలసి ఉంది. గనుక మీ వంతు సహకారం అందించి వాటి రీప్రింట్ కొరకు మీరు సహాయపడవలసినదిగా కోరుచున్నాము. ఇదివరకు మనం ప్రింట్ చేసిన కరపత్రముల లిస్ట్ ఈ క్రింద పొందుపరుస్తున్నాము చూడండి. మీకు ఎవరెవరికి పత్రికలు అవసరమో మాకు వ్రాయండి రీప్రింట్ అవ్వగానే మీకు పంపిస్తాము. ఈ పరిచర్యలో పాలుపొందు ప్రతీ ఒక్కొక్కరినీ పరమతండ్రియైన యావె (యషువ మెస్సీయ) అత్యధికరముగా దీవించి ఆశీర్వదించును గాక!

1. అబద్దబోధకుల ఆదివారం ఆరాధన
2. అబద్దబోధకుల గుడ్‌ఫ్రైడే-ఈస్టర్ సన్‌డే
3. అబద్దబోధకుల లెంట్ దినములు
4. అబద్దబోధకుల క్రిస్ట్‌మస్
5. అబద్దబోధకుల ప్రభురాత్రి భోజన సంస్కారము
6. అబద్దబోధకుల యేసునామము
7. అబద్దబోధకుల మట్టలాదివారము
8. అబద్దబోధకుల క్రొత్తసంవత్సరము జనవరి 1
9. అబద్దబోధకుల వాచ్‌నైట్ సర్వీస్ డిశెంబర్ 31
10. అబద్దబోధకుల పెండ్లికాని పరిచర్యలు
11. అబద్దబోధకుల అపవిత్రనామములు
12. అబద్దబోధకుల బాప్తీస్మములు
13. అబద్దబోధకుల వాక్యంలో లేని దినములు
14. అబద్దబోధకుల సంస్థలు-సంఘాలు
15. అబద్దబోధకుల బైబిలు సొసైటీ-1
16. అబద్దబోధకుల త్రిత్వం-దిత్వం 1,2
17. అబద్దబోధకుల వితర్కవాదములు
18. అబద్దబోధకుల గుణలక్షణములు
19. అబద్దబోధకుల యహ్వె/య:వ: నామములు
20. అబద్దబోధకుల పెంతెకోస్తు సీవాన్ 6
21. అబద్దబోధకుల తెలుగు, ఇంగ్లిష్, గ్రీకు బైబిల్స్
22. అబద్దబోధకుల లూనార్ షబ్బాత్
23. అబద్దబోధకుల వాక్యంలో లేని పండుగలు
24. అంత్యకాలంలో అబద్దబోధకులు ఎవరు?
25. అబద్దబోధకుల ఆశ్రమాలు, నాయకత్వం
26. అబద్దబోధకులైన స్త్రీలు
27. అబద్దబోధకుల బైబిల్స్ మరియు తప్పుడు తర్జుమాలు
28. ఎవడీ జయశాలి ప్రకటన 6:2
29. సర్వజనులకు ఒక్కడే పరమాత్ముడు
30. బాప్తీస్మం అంటే ఏమిటి? ఏ నామంలో పొందాలి?
31. ఎవరీ రెవరెండ్లు?
32. ఆయన నిజమైన పేరేమో నీకు తెలియునా?
33. క్రైస్తవ సంస్థలు - మెస్సీయ సమాజము
34. అపోస్తలులు యూదులా లేక క్రైస్తవులా?
35. నిజమైన షబ్బాతీయుని నియమములు
36. మెస్సీయ సమాజములో నిజమైన సేవకులు
37. యేసునామము వారి మోసం
38. గల్ఫ్ దేశములో క్రైస్తవుల స్థితి
39. మెస్సీయ నిజమరణపునరుత్థాన దినములు అబీబ్ 14-17
40. యషువ మెస్సీయ జన్మదినము ఎతానీమ్ 15
41. మీసములు-గడ్డములు తీసివేయుట బోధకులకు తగునా?
42. ఆది అపోస్తలులకు యేసు క్రీస్తు నామము తెలుసా?
43. బైబిలు పండుగలు
44. ఆది అపోస్తలుల సమాజము మీకు తెలుసా?
45. యేసునామము బాప్తీస్మము వాక్యానుసారమేనా?
46. తెలుగు బైబిలు చరిత్ర
47. మీరు పొందిన బాప్తీస్మం వాక్యానుసారమేనా?
48. మీరు క్రైస్తవులా? అయితే ఇది మీకోసమే
49. ఆది అపోస్తలులు-నకిలీ అపోస్తలులు
50. ప్రభుదినము ఆదివారమా? లేక శనివారమా?
51. అబద్దబోధకుల సున్నతి
52. అబద్దబోధకుల కౌజుపిట్ట సంఘాలు
53. యషువ మెస్సీయ నామములో అబద్దబోధకులు

**ఎడిటర్ నోట్**

ప్రియ పాఠకులకు షలోం. పత్రికను ఉచితముగా పొందుచున్నవారు తప్పక సం॥ర చందా రూ.50/- పంపి పత్రికను పొందవలెను. ఈ పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడచుచున్న సహోదరులు తప్పక పత్రిక పరిచర్యకై సహకరించవలెను. దూరముగా ఉన్న సహోదరులు తమ కానుకలను ఆన్‌లైన్ ద్వారా పంపించవచ్చును.

Isaac E. Kusuma
Online A/C No. **10664134898**
Bank Code 0885
SBI, Narsapur, W.G.Dt

Isaac E. Kusuma
Online A/C No. ABG **10025001028**
Bank Code 0361
Andhra Bank, Malikipuram

## ప్రశ్నలు-జవాబులు

**ప్రశ్న:- ఆసక్తి మంచిదైతే పిలుపు, ఏర్పాటు, అభిషేకం అవసరలేద్దని మీరే బోధించారటగదా!**

**జవాబు: -** మాటలు అపార్థం చేయడం సాతాను యొక్క లక్షణాలలో ఒకటి. సాతాను ఆత్మ చేత ఆవరించబడిన ప్రతీవాడు అదే పని చేస్తూ ఉంటాడు. పరమతండ్రి విషయంలో మంచి ఆసక్తి ఉన్నవాడు గోడమీద పిల్లివాటం గలవాడిలా ఉండడు. లేక సత్యము విషయంలో నూనె-నల్లమందు మ్రింగినవానిలా ఉండడు, ఉండకూడదు. నేను చెప్పింది ముగ్గురి ఆసక్తిని గూర్చి:

1) ఫినెహాసు.................. సంఖ్యా 25:7-13
2) యోవాబు..................2సమూ 18:9-15
3) స్తెఫను.....................అ॥కార్య 6:2-6+ 7వ అధ్యాయం

**- ఫినెహాసు** పరమతండ్రి కోసం ఎంతో ఆసక్తి కనబరచి నిత్యనిబంధన యాజకుడయ్యాడు. యాజకులవద్ద అభిషేకం తీసుకోకుండానే యాజకుడయ్యాడా? ఆసక్తి ఎంతవరకూ పనిచేసింది? కొంతవరకే గదా! వాక్యం అర్థం కావడం లేదా?

**- యోవాబు** అబ్షాలోమును చంపే విషయంలో ఆసక్తి చూపించాడు ఎందుకు? అతని వలన దావీదు రాజ్యానికే ప్రమాదం. అందుకే రాజైన దావీదు మాటను కొట్టిపారేసి అబ్షాలోమును చంపాడు. అతనికి అభిషేకం అవసరమా? అతను ఏమైనా యాజకుడా? అతను కేవలం ఒక సైన్యాధిపతి. మంచి విషయంలో ఆసక్తిపరుడే గాని సమాజకాపరి కాడు. ఇతనికి అభిషేకం అవసరం లేదు.

**- స్తెఫను** ఆరు సమాజములు వారికి ఆత్మీయమైన విషయాలలో సమాధానం చెప్పి నోరుమయ్యించిన పరిశుద్ధాత్మపూర్ణుడు. ఆత్మానుసారమైన జ్ఞానం బోధించిన హతసాక్షి. యాజకుడు కాడు గనుక అతనికి అభిషేకం అవసరం లేకపోయింది. అతని ఆసక్తి చాలామంచిది. ఇలా మంచిపనులు చేయడానికి పిలుపు, ఏర్పాటు, అభిషేకం అవసరలేద్దు. కాని ఒక సమాజానికి కాపరి అవ్వాలంటే తప్పక పిలుపు, ఏర్పాటు, అభిషేకం అవసరం. సాతాను తెలివితేటలు, వంకర బ్రతుకు మానుకుంటే చాలామంచిది. అపోస్తలుడైన సౌలు పిలువబడినపుడు, అతనికి ఒక దర్శనము, ప్రత్యేకమైన పని పరమతండ్రి ఇచ్చాడు. అపోస్తలులు అభిషేకించి (అ॥కార్య 13:1-3) సిరియాలోని అంతియొకయ సమాజానికి సమాజకాపరిగా పంపించారు. అపోస్తలుడైన సౌలు అక్కడనుండే తన మిషినరీ ప్రయాణాలు సాగించాడు. దొంగ బోధకులు దొంగదారిలో వస్తూ ఉంటారు, కౌజుపిట్ట సంఘాలు (యిర్మీయా 17:11) కడుతూ ఉంటారు. అవి ఏదో ఒక రోజు కూలిపోతాయి అని వారికి తెలుసు గనుకనే గోడమీద పిల్లివాటం, నూనె-నల్లమందు మ్రింగినవాని వలె ఉంటారు. అందుకే ముఖద్వారం మాటలు మానేసి దొంగ దారి మాటలు మాట్లాడుతూ ఉంటారు. పిలుపు, ఏర్పాటు, ఆసక్తి, అభిషేకం విషయం అర్థం అయ్యిందనుకుంటాను. షలోం. అపోస్తలుడైన సౌలు గాని మెస్సీయ గారి శిష్యులు గాని సేవకు పిలువబడినపుడు అన్నీ వదులుకొని వచ్చారు. అందరూ సపోర్టు చేసినప్పుడు సేవకు రాలేదు. లేక కొందరి అండదండలను చూసుకొని కాపరులుగా అవతారాలు ఎత్తలేదు. లేక రక్తసంబంధులను, బంధుమిత్రులను కలుపుకొని స్వంతప్రదేశాలలో సేవ చెయ్యలేదు. చదవండి ఈ వాక్యాలు: మార్కు 10:28, లూకా 14:25-33, గలతీ 1:10+12+16,17, ఎవరో కొందరు దాగోను దేవత (1సమూ 5వ అధ్యాయం) నిలబెట్టినట్లు నిలబడితే దానికి ఎలా జరిగిందో అదే జరుగుతుంది. గనుక చాలా జాగ్రత్తగా ఉండాలి. అయినా లోకల్‌గాళ్ళు లోకల్‌లో సేవకులుగా పనికిరారు మార్కు 6:4., బయటనుండి రావాలి లేక ఎక్కడనుండో వచ్చి సేవ చెయ్యాలి యోహాను 9:29,30. నేను 1984లో మల్కిపురం వచ్చాను. మల్కిపురం నా స్వంత గ్రామం కాదు. 1984 నుండీ నేను సేవలో ఉన్నాను. గనుక అర్థం చేసుకొని మాట్లాడండి.

**2. పరమతండ్రి మనకు తండ్రి అవుతాడా లేక భర్త అవుతాడా?**

**జవాబు: -** సహజంగా చిన్నతనం నుండి భక్తి చేసే మనకు/మనము పరమతండ్రిని, తండ్రీ, నాయన అని పిలుస్తూ ప్రార్థన చేస్తుంటాము గనుక ఆయన మనకు తండ్రి అనుకోవడం వాడుకగా వస్తున్న అలవాటు. కాని లోతుగా వెళ్ళి వాక్యంలో చూస్తే ఆయన భర్తగానే కనిపిస్తున్నాడు.

- నిన్ను సృష్టించినవాడు నీకు భర్తయై యున్నాడు............................. యెషయా 54:5
- ఆయన భార్య తన్ను తాను సిద్ధపరచుకొనియున్నది......................... ప్రకటన 19:7
- ఇటురమ్ము, పెండ్లికుమార్తెను, అనగా గొఱ్ఱెపిల్లయొక్క భార్యను నీకు చూపెదనని...ప్రకటన 21:9

అటులనే ఎఫెస్సీ 5:22-33, మత్తయి 25:1-13 మొ॥గు వాటిలో యషువ మెస్సీయ భర్తగా, పెండ్లికుమారునిగా కనిపిస్తున్నాడు. గనుక పసిపిల్లల విశ్వాసము గలవారిని ఆయన తండ్రిగా కనిపించినప్పటికీ ఆయన మాత్రం వాక్యప్రకారం భర్తే.

**3. అనుమానం గూర్చి మీ అభిప్రాయం ఏమిటి?**

**జవాబు: -** అనుమానింపజేయడం అనేది 100% సాతాను లక్షణం. అనుమానం అనేది ఒక పెద్ద దయ్యం. ఇది చాలా ప్రమాదకరమైనది ఈ ఆత్మ మనిషిలో దూరిందంటే ఆ ఇంట్లో ఇక నరకమే. - ఇది నిజమా? అంటూ యుక్తిగల సర్పము హవ్వమ్మకు అనుమానం పుట్టించింది. అంతే హవ్వమ్మ పరమతండ్రి మాటను నమ్మలేదు. పరమతండ్రినే అనుమానించింది. ఆయన ఏదో వీరికి (ఆదాముకు-హవ్వకు) దాచేస్తున్నట్లు, అది ఏదో ఈమె కనిపెట్టాలని పండు కోసుకొని తిని, తర్వాత పశ్చాత్తాపపడింది. సాతాను మనిషిలో ముందు అనుమానపు బీజం వేస్తాది. దానికి లొంగకపోతే కొంత ఋజువులు చూపించడానికి ప్రయత్నిస్తుంది. (ఋజువులు చూసి నమ్మని వారుండరు). కాని కొన్ని కొన్ని సార్లు ఋజువులు కూడా అబద్ధమే అవుతాయి. చాలామంది వాటిని కనిపెట్టలేరు. భక్తులు, భక్తిహీనులు కూడా పడిపోతారు.

ఉదా:- 1. ఆది 37:31-36 చదవండి. ఋజువు చాలా చక్కగా కనిపిస్తుంది. కాని దాని వెనుక ఉన్న నిజం మాత్రం చాలా దూరంగా ఉంది. దీనిని యోసేపు తండ్రి గుర్తుపట్టలేదు. కాని యోసేపు కుమారులకు (అబద్ధికులకు) నిజం తెలుసు. నిజమేదో తెలుసుండి కూడా అబద్దాన్ని నమ్మింపజేయడమే సాతానుయొక్క ట్రిక్. దీనిని అందరూ పసిగట్టలేరు. ఇలాంటి విషయాలు పసిగట్టాలంటే పరిశుద్ధాత్మ ఉండాలి. 2. ఆది 39:14-20 చదవండి. ఇక్కడ కూడా ఋజువు చాలా చక్కగా కనపడుతుంది. కాని దాని వెనుక ఉన్న నిజం మాత్రం చాలా దూరంగా ఉంది. - 10వ వచనం దినదినము ఆమె యోసేపుతో మాటలాడుచుండెను గాని........అని ఉంది. దినదినము యోసేపుతో మాట్లాడుచున్న సంగతి ఈమె తన భర్తకు ఎప్పుడూ ఏమీ చెప్పలేదు గాని తన కోరిక తీర్చకపోయేసరికి యోసేపును రాజ్యమంతా చాలా చండాలంగా చిత్రించింది. కాని నిజమనేది ఆమెకు తెలుసు-యోసేపుకు తెలుసు పరమతండ్రికి తెలుసు. కాని రాజ్యమంతా నమ్మింది రాణి అబద్ధమునే గదా! ఋజువుగా అంటే అబద్దాన్ని నమ్మించడానికి యోసేపును చొక్కాను వాడుకుంది. కాని అది నిజం కాదు. అనుమానించడానికి అనేక ఋజువులు కోర్టులో కూడా ప్రవేశపెడుతుంటారు. కాని వాటికి వ్యతిరేకంగా నిజమనేది ఉంటూ ఉంటాది. అది అంతే. What cannot be cured should be endured ఏ జబ్బుకి అయితే మందు ఉండదో దానిని భరించుకోవలసిందే.

## పస్కాకు ఆహ్వానము

ప్రియ సహోదరుడా! సహోదరీ!

పరిశుద్ధ లేఖనములలో వ్రాయబడిన ఈ పండుగ బైబిల్ క్యాలెండరును అనుసరించి అబీబ్/నీసాన్ అనే మొదటి నెల 14వ తేదీనుండి 21 వరకు జరుగును. (లేవీ 23:5-8).

**ఏప్రిల్ 17వ తేదీ ఆదివారం సాయంకాలం పస్కా ఆచరించబద్దులమై యున్నాము. పాదప్రక్షాళనతో (యోహాను 13:14,15) పస్కాను ఆచరించుటకై రండి.**

ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.

సమయములు: ప్రతీరోజు సాయంత్రం 7.00 గం॥ల నుండి 10.00 వరకు
ప్రతీరోజు ఉదయం 9.00 గం॥ల నుండి 12.30 వరకు
ప్రతీరోజు మధ్యాహ్నం 2.00 గం॥ల నుండి 4.30 వరకు

***అసెంబ్లీస్ ఆఫ్ ది లివింగ్ ఎలోహీం***
***చొప్పల వారి గ్రూపు, మలికిపురం-533 253, తూ॥గో॥జిల్లా***

**శుభవార్త:** ఆసక్తిగల యవ్వనస్తులకు ఉచితముగా హెబ్రీ భాషలో వ్రాయుట, చదువుట నేర్పబడును. ఈ సదావకాశం ఈ పండుగ దినములలో మాత్రమే గనుక త్వరపడి సంప్రదించండి. సెల్ 98493 85038

Printed, Published and Owned by Isaac. E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram -533 253. E.G. Dt. and Publsihed at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved